నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్, ఆదివారం 17 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

పులి పాదముద్రల గుర్తింపు

పెంబి, నవంబర్ 16 : పెంబి మండలంలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో రెండు రోజుల నుంచి పెద్దపులి సంతరిస్తున్నది. శనివారం మండల కేంద్రంలోని అడెల్లి పోచమ్మ ఆలయం వద్ద అటవీ శాఖ అధికారులు పులి పాదముద్రలను గుర్తించారు. పెంబి పరిసర ప్రాంతాల్లోనే పులి సంచరిస్తున్నదని ఎఫ్ఆర్వో రమేశ్‌రావు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాత్రి సమయాల్లో ఎవరు భయటకు వెళ్లవద్దని, పొలాలకు కూడా వెళ్లొద్దన్నారు.

పోచమ్మ ఆలయం వద్ద పులి పాదముద్రలు గుర్తించిన అధికారులు

పార్లమెంట్ హౌస్‌లో మన కళాకారులు

ఇచ్చోడ, నవంబర్ 16 : దేశ రాజధాని ఢిల్లీ పార్లమెంట్ హౌస్‌లో నిర్వహించిన బిర్సాముండ జయంతి ఉత్సవాల్లో శనివారం దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ సకల కళా సంక్షేమ సంఘం డైరెక్టర్ కాత్లే శ్రీధర్ నృత్య బృందం ప్రదర్శించింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పార్లమెంట్ స్పీకర్ పాల్గొని బిర్సా ముండాకు నివాళులర్పించారు. కార్యక్రమం అనంతరం రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రతి ఒక కళాకారుడిని కలిశారు. ఈ ఉత్సవాల్లో తమ జట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కాత్లే ఆనంద్, సభ్యులు చిట్టిబాబు, శాంతకుమారి పాల్గొన్నారు.

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, పార్లమెంట్ స్పీకర్‌తో మండల కళాకారులు

ట్రిపుల్ ఐటీ వెనుక భాగంలో నుంచి గోడ దూకుతున్న ఏబీవీపీ కార్యకర్తలు

ట్రిపుల్ ఐటీ వద్ద హై టెన్షన్

ఏబీవీపీ ముట్టడి నేపథ్యంలో భారీగా పోలీసుల మోహరింపు

- ఉదయం ఐదు గంటల నుంచే అరెస్టుల పర్వం
- ఎస్పీ, అడిషనల్ ఎస్పీతోపాటు 250 మంది బందోబస్తు

బాసర, నవంబర్ 16 : బాసర ట్రిపుల్ ఐటీ వద్ద శనివారం హై టెన్షన్ నెలకున్నది. స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనలో ఏబీవీపీ కార్యకర్తపై జరిగిన దాడి నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏబీవీపీ కార్యకర్తలు శనివారం బాసర ట్రిపుల్ ఐటీని ముట్టడి కార్యక్రమం చేపట్టారు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ జానకీ షర్మిల, భైంసా అడిషనల్ ఎస్పీ అవినాశ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు దాదాపు 250 మంది పోలీసు సిబ్బంది ఉదయం ఐదు గంటలకే బాసర చేరుకుని రైల్వే, బస్ స్టేషన్ ప్రాంతాల్లో అనుమానితులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొందరు ఏబీవీపీ కార్యకర్తలు ట్రిపుల్ ఐటీ వెనుక భాగంలో గల రైల్వేట్రాక్ నుంచి దాదాపు 40 మంది కార్యకర్తలు నినాదాలు చేస్తూ పరిగెత్తుతూ ట్రిపుల్ ఐటీ ప్రహరీ ఎక్కడానికి ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని అరెస్టు చేశారు. అందులో 15 మంది గోడ దూకి లోపలికి వెళ్లగా లోపల కూడా అరెస్టు చేశారు. ఇటు బాసర ఆలయంలో కూడా అనుమానితులను అరెస్టు చేశారు. ఆలయంలో కొందరు ఏబీవీపీ కార్యకర్తలు తమకు అమ్మవారి దర్శనం కూడా చేసుకోనిస్తలేరని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో భక్తులకు కొంచెం ఇబ్బందులు ఎదురయ్యాయి. దాదాపు 200ల మందికిపై గా ఏబీవీపీ కార్యకర్తలను బాసరలో అరెస్టు చేశారు. కాగా.. ఎస్పీ జానకీ షర్మిల ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మెయిన్ గేట్ ఎదుటే ఉన్నారు. ట్రిపుల్ ఐటీలో పని చేస్తున్న సిబ్బంది ఐడీ కార్డులు ఉంటేనే లోనికి అనుమతించారు. మీడియాకు ఇక్కడ అనుమతి లేదంటూ పోలీసు సిబ్బంది అన్నారు. ట్రిపుల్ ఐటీ లోపల అంత ప్రశాంతంగా ఉందని విద్యార్థులు క్లాసులకు, ల్యాబ్‌లకు హాజరవుతున్నారని తల్లిదండ్రులు కంగారు పడొద్దని ఎస్పీ అన్నారు.

బాసర ఆలయంలో అనుమానితులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆలయంలో పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న భక్తులు

రైల్వేస్టేషన్ వద్ద ఏబీవీపీ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు(ఫైల్)

వికృత క్రీడ

స్పోర్ట్స్ కోటా పేరిట క్రీడా సంఘాల దోపిడీ

- జాతీయ స్థాయి పోటీలను ఆడించేందుకు డబ్బుల వసూళ్లు
- ఒక్కో లెవెల్‌కు ఒక్కో రేటు
- ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తిస్తాయని పేరెంట్స్‌కు ప్రలోభ
- అందినకాడికి దండుకుంటున్న సంఘాల బాధ్యులు
- పట్టించుకోని అధికారులు

నిర్మల్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ) : 'మీ అబ్బాయి ఆటల్లో చాలా చురుకుగా ఉన్నాడు. ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచాడు. ఇలాగే ఆడితే రాబోయే రోజుల్లో జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించగలుడు. ఒక్కసారి నేషనల్స్‌కు ఆడితే మీ బాబుకు సర్టిఫికేట్ కూడా వస్తుంది. ఈ స్పోర్ట్స్ సర్టిఫికేట్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కోటా ఉంటుంది. భవిష్యత్‌లో సులువుగా ఉద్యోగాన్ని కూడా దక్కించుకోవచ్చు.' అని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు పేరెంట్ వద్దకు వెళ్లి ప్రలోభపెడుతాడు. దీంతో సదరు పేరెంట్ మా అబ్బాయి నేషనల్స్‌కి ఎంపికవుతాడా ? అని తన సందేహాన్ని వ్యక్తం చేస్తూనే, అది సాధ్యమవుతుందా? అంటాడు. దీంతో వెంటనే ఆ పీఈటీ స్పందించి.. నేషనల్స్‌కు ఎంపిక కావడం అంటే అది మామూలు విషయం కాదు. డబ్బులు ఖర్చు చేస్తే తప్పకుండా జాతీయస్థాయి పోటీలకు మీ అబ్బాయి ఎంపికయ్యేలా చూస్తానని హామీ ఇస్తాడు. మీ అబ్బాయి ఆడే ఆటకు సంబంధించి జిల్లా క్రీడా సంఘం బాధ్యుడికి డబ్బులిస్తే పనైపోతుంది. అని ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని, పూర్తి రహస్యంగా ఉంచాలని చెబుతాడు. దీంతో సదరు పేరెంట్ తన కొడుకు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అడిగినన్ని డబ్బులు ఇచ్చేస్తాడు.

కొంతకాలంగా నిర్మల్ జిల్లాలో క్రీడాసంఘాల బాధ్యులు ఇదే తరహా వికృత క్రీడకు తెరలేపారు. క్రీడల్లో పాల్గొంటున్న విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. డబ్బులిచ్చిన పేరెంట్స్ ఎవరికీ చెప్పరన్న ధీమాతోపాటు, క్రీడల్లో జరిగే అవినీతిపై ఉన్నతాధికారులు పెద్దగా దృష్టి సారించరన్న భావనతో సంఘాల బాధ్యులు కొందరు తమ అవినీతి బాగోతాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేసుకునే క్రీడాసంఘాలకు ఆయా క్రీడల రాష్ట్ర అసోసియేషన్ నుంచి కచ్చితంగా గుర్తింపు ఉండాలి. అలాగే కొన్ని క్రీడలకు రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ అప్లియేషన్ ఉండాలి. రాష్ట్ర సంఘాల సమక్షంలో జిల్లా క్రీడా సంఘాలను ఏర్పాటు చేసి, సంఘం బాధ్యుల వివరాలను జిల్లా యువజన క్రీడల అధికారికి అందజేయాలి. అంతేకాకుండా ఈ ఎన్నికల్లో జిల్లా క్రీడల అధికారి స్వయంగా పాల్గొనాలి. కానీ.. ఈ నిబంధనలేవి పాటించకుండానే ఎవరికి వారు క్రీడా సంఘాలను ఏర్పాటు చేసుకుని, ఇష్టారీతిన రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వారం రోజుల క్రితం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. అలాగే గత సెప్టెంబర్‌లో ఇదే స్టేడియంలో రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు జరిగాయి. ఆయా పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. అయితే ఈ పోటీల్లో నిబంధనలను పాటించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పోటీలను మూడు రోజులపాటు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం ఒకటిన్నర రోజులోనే ముగించినట్లు విమర్శలు ఉన్నాయి. పోటీల నిర్వహణను పరిశీలించిన జిల్లా క్రీడల అధికారి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంలో నిర్వాహకులు పూర్తిగా విఫలమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే క్రీడా సంఘాల బాధ్యులు మాత్రం ఇవేమి పట్టించుకోకుండా తూతూ మంత్రంగా పోటీలను నిర్వహించి, డబ్బుల వసూళ్లపైనే దృష్టి సారించినట్లు సమాచారం. సరైన వసతులు కల్పించకుండా రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించడంపై క్రీడాభిమానులు మండిపడుతున్నారు.

ఒక్కో లెవెల్‌కు ఒక్కో రేటు..

దాతల సహకారంతో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించే క్రీడా సంఘాలు.. ఆ తర్వాత జాతీయ స్థాయి పోటీలపై దృష్టి సారిస్తాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను గుర్తించి, స్థానికంగా ఉండే వ్యాయామ ఉపాధ్యాయుల ద్వారా రహస్యంగా వారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఆడించేందుకు వేరువేరుగా రేటును నిర్ణయిస్తారు. సబ్ జూనియర్స్‌కు అయితే రూ.15 వేల నుంచి రూ.20 వేలు, జూనియర్స్‌కు రూ.25వేల నుంచి రూ.40 వేల వరకు, అలాగే సీనియర్స్ విభాగంలో ఆడించేందుకు రూ.50 వేలకు పైగా పేరెంట్స్ నుంచి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో క్రీడా సంఘాల బాధ్యులతోపాటు ఓ ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుని పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. క్రీడల్లో ప్రతిభ ఉన్నా లేకున్నా డబ్బులిస్తే చాలు రాష్ట్రం తరపున నేషనల్స్‌లో ఆడేందుకు అవకాశం కల్పిస్తారు. దీంతో అసలైన క్రీడాకారులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నది. ఇదే పద్ధతిని స్కూల్ గేమ్స్‌లో కూడా కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్రీడల అభివృద్ధిపై దృష్టి సారించి, క్రీడాకారుల ఎంపికలో అవినీతికి ఆస్కారం లేకుండా చూడాలని క్రీడాభిమానులు కోరుతున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం..

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసేందుకు క్రీడా సంఘాల బాధ్యులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు పలువురు మాట్లాడుకుంటున్న మాట వాస్తవమే. అయితే బాధితులు ఎవరైనా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. డబ్బులు తీసుకుని క్రీడాకారులను ఎంపిక చేయడం వల్ల ప్రతిభ గల వారికి అన్యాయం జరుగుతుంది. ఇటీవల నిర్మల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులకు సరైన వసతులు కల్పించలేదు. ఈ విషయాన్ని నిర్వాహకుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. రాష్ట్ర ఒలింపిక్ అసోసియేషన్ ద్వారా గుర్తింపు ఉన్న క్రీడా సంఘాలు మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించాలి.

- శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి, నిర్మల్.

ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలి

నిర్మల్ చైన్‌గేట్, నవంబర్ 16 : ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి రిపోర్టులను వెంటవెంటనే తమకు అందజేయాలన్నారు. గన్ని బ్యాగులు, ప్యాడి క్లీనింగ్, టార్పాలిన్లు, తూకపు, తేమ యంత్రాలు, అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తరుగుపేరుతో రైతుల నుంచి అధిక ధాన్యం సేకరిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. సమావేశంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఎం వేణుగోపాల్,, డీసీవో రాజమల్లు, రైస్‌మిల్లర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చలిమంటలు కాగుతున్న జనం

వణికిస్తున్న చలి

- పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- 14.7 డిగ్రీలు నమోదు

ఆదిలాబాద్, నవంబర్ 16(నమస్తే తెలంగాణ) : జిల్లావాసులను చలి వణికిస్తున్నది. సీజన్ ప్రారంభం నుంచి చలి తీవ్రత అంతంత మాత్రంగానే ఉండగా.. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. 13 నుంచి 15 డిగ్రీల మధ్య కనిష్ఠ టెంపరేచర్ నమోదవుతున్నది. శనివారం జిల్లాలో 14.7 డిగ్రీలు నమోదైంది. సాయంత్రం ప్రారంభమైన చలి ఉదయం 8 గంటల వరకు ఉంటున్నది. అటవీ ప్రాంతంతోపాటు ఏజెన్సీలో చలి ప్రభావం అధికంగా కనపడుతున్నది. చలితోపాటు పొగ మంచు కురుస్తుండడంతో ప్రజలు ఉదయం సమయంలో బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. జాతీయ రహదారిపై వాహనదారులు లైట్లు వేసుకుని వెళ్తున్నారు. ఉదయం, రాత్రి చలిమంటలు కాగుతున్నారు. స్వెట్టర్లు, మంకీక్యాప్‌లు ధరిస్తున్నారు. ఉదయం సమయంలో చాయ్ దుకాణాల వద్ద జనం ఎక్కువగా కనపడుతున్నారు. ప్రజలు స్వెట్టర్లు, క్యాప్‌లు కొనుగోలు చేయడానికి దుకాణాల వద్ద గుమిగూడుతున్నారు. ప్రజలు రక్షణ చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పట్టరా.. పట్టు..

తానూర్‌లో ఆకట్టుకున్న కుస్తీపోటీలు

తానూర్ మండల కేంద్రంలోని శ్రీ విఠలేశ్వరుడి జాతర సందర్భంగా శనివారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. మన జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి పదుల సంఖ్యలో మల్లయోధులు కుస్తీ పోటీల్లో తలపడ్డారు. తిలకించేందుకు తండోప తండలుగా తరలివచ్చిన జనంతో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణ కిక్కిరిసింది. నిర్వాహకులు విజేతలకు మొదటి బహుమతి రూ.*11,111*.. ద్వితీయ బహుమతి రూ.*8,851* అందించారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రమేశ్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి సచిన్ పాఠక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పంగి పండరి, మాజీ సర్పంచ్‌లు తాడేవార్ విఠల్, జాదవ్ మాధవ్ రావుపటేల్, దార్మోడ్ రాములు, సొసైటీ డైరెక్టర్ హున్‌గుందే పుండ్లిక్, శ్రీసరస్వతీ శిశు మందిర్ అధ్యక్షుడు శివాజీ పటేల్, ఆలయ కమిటీ సభ్యులు నాయకులు బండారే సోమేశ్, దేవిదాస్ పటేల్, విఠల్, గ్రామ పెద్దలు అరుణ్ దేశ్‌పాండే, గంగాధర్ పాల్గొన్నారు.

- తానూర్, నవంబర్ 16

కుస్తీ పడుతున్న మల్లయోధులు

గ్రూప్-3కి రెడీ

- నేడు, రేపు పరీక్ష
- ఆదిలాబాద్‌లో ఏర్పాట్లు చేసిన అధికారులు
- 29 కేంద్రాలు.. 10,255 మంది అభ్యర్థులు
- కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

ఎదులాపురం, నవంబర్ 16 : గ్రూప్-3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. 29 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 10,255 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశాలను నిర్వహించి దిశానిర్దేశం చేశారు. పొరపాట్లకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 17, 18 తేదీల్లో నిర్వహించనున్న టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కార్యాచరణ రూపొందించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో పరీక్ష జరగనుండగా.. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. కాగా.. శనివారం ఆయా పరీక్ష కేంద్రాల్లో స్టిక్కరింగ్ వేయగా.. చీఫ్ సూపరింటెండెంట్ అరుణ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రతిష్ట పోలీసు బందోబస్తు

గ్రూప్-3 పరీక్షకు ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై శనివారం జిల్లా పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో సిబ్బంది చేయాల్సిన విధులపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అభ్యర్థులు కేంద్రాలకు నిర్ణీత సమయానికి ముందే చేరుకోవాలని, కేంద్రంలో విధులు నిర్వర్తించే ప్రతి వ్యక్తి కచ్చితంగా గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని తెలిపారు. ఐదు రూట్లలో సీఐ స్థాయి అధికారి ఇన్‌చార్జిగా ఉంటూ ఎస్సై స్థాయి అధికారి ద్వారా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పరీక్ష పత్రాల, జవాబు పత్రాల తరలింపులో ప్రత్యేక పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావ్, గ్రూప్-3 నోడల్ అధికారి జగ్రాం, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

నిర్మల్ అర్బన్, నవంబర్ 16 : నిర్మల్ జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 8,124 మంది అభ్యర్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా.. 24 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో 9.30 గంటల తర్వాత ఎవరిని లోనికి అనుమతించరు. తొలి రోజు రెండు పరీక్షలు.. సోమవారం మూడో పరీక్షను నిర్వహించనున్నారు. ఈ పరీక్ష నిర్వహణకు 24 మంది ముఖ్య పర్యవేక్షకులు, 24 మంది శాఖాధికారులు, 10 మంది ఫ్లయింగ్ స్క్వాడ్, 338 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు, 63 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియమించారు. పరీక్షను ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్రాల్లో 144 సెక్షన్‌ను అమలు పర్చారు.